# టిట్ ఫర్ టాట్

అద్దేపల్లి సుచిత్రాదేవి

"రెండు పదులు నిండలేదు పట్టుమని. అప్పుడే నీ జీవితాన్ని నువ్వే నిర్ణయించేసుకునేంత పెద్దదానివై పోయావా?"

"ఇన్నాళ్ళు పెంచి పెద్దచేసిన కన్నవాళ్ళ మాటకు నీ దృష్టిలో విలువే లేదన్నమాట?"

"సర్వం ప్రేమ మయం అని కల్లలో విహరిస్తున్న నీకు నాలుగు రోజులకే ఆ ప్రేమ అస్తం పెట్టదని తెలియవస్తుంది చూడు.

అప్పుడు మళ్ళీ అమ్మా నాన్న అని బిక్కముఖం వేసుకుని వస్తావు. మమ్మల్ని కాదని రాజుని చేసుకున్నందుకు మేము నీ ముఖం చూడము అప్పుడు."

"అయినా అతడు నిన్నూ, నీ అందాన్ని చూసి ప్రేమించాడనుకుంటున్నావా? ఏం కాదు. నీ వెనుకనున్న లక్షల ఆస్తిని చూసి నిన్ను వలలో వేసుకున్నాడు. అది తెలియటం లేదు నీకు."

ఆ తరహా మాటలన్నీ తల్లీ తండ్రినుంచి వినివిని విసుగెత్తిపోయింది సంయుక్తకి.

"అమ్మా, నాన్న, మీరు వెయ్యి చెప్పండి, లక్ష చెప్పండి. నేను మాత్రం పెళ్ళంటూ చేసుకుంటే రాజునే చేసుకుంటా. లేకపోతే లేదు. అంతే!" తేల్చి చెప్పేసింది.

"నీ నిర్ణయాన్ని మార్చుకోవా?"

"మార్చుకునే నిర్ణయాలు నేనెప్పుడూ చేసుకోనని మీకు తెలుసు." తల్లి ఎంత తీక్షణంగా అడిగిందో అంతే చురుగ్గా జవాబు చెప్పింది సంయుక్త.

"అలాగా! నీ నిర్ణయాన్ని ఎలా మార్చిస్తానో చూడు. రాజు నీ డబ్బు చూసి కాదు నిన్నే ప్రేమిస్తున్నాడు. ఈ నిముషాన కట్టుబట్టలతో బయటకెళ్ళిపోయినా నీ చేయందుకుని నిన్ను పెళ్ళి చేసుకుంటాడు. కలకాలం కళ్ళల్లో పెట్టుకు కాపురం చేస్తాడు అనుకుంటున్నావు కదా. ఒక్క అయిదు నిమిషాలు చాలు అతని మనసు మార్చటానికి" ఛాలెంజింగ్‌గా అంటున్న తండ్రి రామారావు వంక అనుమానంగా చూసింది సంయుక్త.

"ఎలా మారుస్తారు?"

"ఎలానా? డబ్బు! అది చేయలేని పనంటూ ఏమీ లేదీ లోకంలో. నీ కళ్ళముందే నిరూపిస్తా చూడు" అంటూనే గబగబా లోపలికెళ్ళి ఓ బ్రీఫ్‌కేసులో డబ్బు తెచ్చాడు. అవి సంయుక్త ముందు పెట్టి అన్నాడు–

"ఆ రాజు గది అడ్రసివ్వు. ఇదో రెండు లక్షలు. ఇవిలాగే తీసుకెళ్ళి అతని ముందుంచి మా అమ్మాయి గురించి మర్చిపోయి యిక్కడ్నుంచి వెళ్ళిపోతే ఈ డబ్బు నీదే అంటాను. డబ్బు చేదా? డబ్బు తీసుకుని మాయమవుతాడు. అంతే!" తేలిగ్గా అన్నాడు.

"తెలుగు సినిమాల ప్రభావం" మనసులో అనుకుంటూ" • రాజు అలా మనీకి లొంగే మనిషికాదు" అన్నది సంయుక్త.

"ఋజువు చేస్తాను. నిన్ను మర్చిపోతున్నట్టు ఉత్తరం వ్రాయించి మరీ తీసుకొస్తాను సరేనా?" అడిగాడు.

"అలాగే" నవ్వింది సంయుక్త.

"కానీ నువ్విక్కడ్నుంచి అతగాడికి ఫోన్లవీ చేయగూడదు" హెచ్చరికగా అన్నాడాయన.

"ఎందుకు చేస్తాను? ఇది నా ప్రేమకే పరీక్ష. అతను నిజంగానే యీ డబ్బుకు అమ్ముడుపోయే పనయితే యింకా నేనతన్ని ప్రేమిస్తున్నాననడం తెలివి తక్కువేగా. వెళ్ళిరండి. మీ రక్కడకు వెళ్ళి రావటానికీ, అతన్ని కన్విన్స్ చేసేందుకు గంట పైనే పడుతుంది. ఇదో అంతేసేపు నేనీ సోఫాలోనే కూర్చుంటాను. అటు యిటు కదలను. అమ్మ కాపలాగా వుంటుంది కదా వెళ్ళిరండి." అదే నవ్వుతో సాగనంపింది సంయుక్త తండ్రిని.

రామారావు ఎలా వెళ్ళాడో అలాగే గంట తర్వాత తిరిగి వచ్చేశాడు చిటపటలాడే ముఖంతో.

"ఏమయింది?" తండ్రి చేతిలోని బ్రీఫ్‌కేసు అలాగే వుండటం చూస్తూ అడిగింది.

"కోటీశ్వరుడి కూతురువి. రెండు లక్షలతో ముఖం చాటుచేసుకోవటం ఎందుకులే అనుకుని వుంటాడు" సోఫాలో వుస్సురని వాలాడు.

పక్కున నవ్వబోయి ఆపుకుంది సంయుక్త.

"అబ్బ... కూర్చుని కూర్చుని కాళ్ళు లాగుతున్నాయి. అమ్మా కాసేపు నేనలా తిరిగివస్తాను." లేచి బయటకు వెళ్ళింది సంయుక్త.


** ** **

ఆ వెళ్ళటం, వెళ్ళటం నేరుగా రాజు గదికే వెళ్ళింది. ఆమెని చూడటమే ముఖం ఎర్రగా చేసుకుంటూ అడిగాడు రాజు.

"రా... రా... నువ్వేంత బేరం పెట్టడానికి వచ్చావు? ఇప్పుడే మీ నాన్న వచ్చి వెళ్ళాడు. రెండు లక్షలిస్తాను, నా కూతురి జీవితంలోంచి వెళ్ళిపో" అంటూ...

"మరే, దానికి నువ్వేమో ఫెంగళప్పలా వద్దు నా ప్రేమ పవిత్రం, పావనం, అమరం అదీ యిదనీ డైలాగులు కొట్టావు. అవునా?" చిరుకోపంగా అడిగింది సంయుక్త రాజునే ప్రేమగా చూస్తూ..

"అదేమిటి నేను డబ్బు కన్నా నీకే విలువ నిచ్చానని తెలిసి సంతోషపడక, పొంగిపోక అలా విరుబుర్రు లాడుతావేం?" తెల్లబోతూ అడిగాడు



రాజు.

"అది సరేనోయ్ సంయుక్తా పతీ, డబ్బు తనంతట తను అదీ కోటీశ్వరుడైన మామగారు స్వయంగా వచ్చి యిస్తుంటే వద్దనటం మాత్రం ఏం తెలివయిన పని? ఇలా అయితే నువ్వెలా బ్రతుకుతావు. నన్నెలా బ్రతికిస్తావు?" నిలదీసింది. ఇంక అర్థం కానట్టు చూస్తున్న రాజుకి ఆపై జ్ఞానబోధ చేసింది సంయుక్త.

"మా నాన్న యెటు మన పెళ్ళికి ఒప్పుకోవడు. మనిద్దరం యిలాగే యింట్లోంచి వెళ్ళిపోయి పెళ్ళి చేసుకోవాల్సిందే అవునా!

ఈ సిటీలోనే మా నాన్న కళ్ళముందే వుంటే మనల్ని నిశ్చింతంగా బ్రతకనివ్వడు. వూరు వదిలి వెళ్ళాలి. అందుకే మా న్నానకి ఫోన్ చేయి. "నేను మనసు మార్చుకున్నాను. మీరన్నట్లుగానే మీ అమ్మాయి ప్రేమను మర్చిపోయి యీ వూర్నుంచి వెళ్ళిపోతాను. కానీ రెండు కాదు అయిదు లక్షలివ్వాలి అని చెప్ప, అయిదు కాదు మా నాన్న నా ముందు గెలిచేందుకు పది లక్షలయినా యిస్తాడు. అది తీసుకో. నువ్వు యీ వూర్నుంచి వెళ్ళిపోయేందుకు కొత్త జీవితంలోకి అడుగు పెట్టేందుకు ఓ దూర ప్రాంతానికి టిక్కెట్టు కొను. ఒకటి కాదు, రెండు టిక్కెట్లు. నీతోపాటు నాక్కూడా."

'అంటున్న ఆమె వైపు చూసి నోరు తెరిచేసాడు రాజు.

"ఆ! ఇది అన్యాయం. సంయూ... చీటింగ్ కదూ?"

"ఏం కాదు. మా నాన్న మన పెళ్ళికిస్తున్న కానుక అనుకొందాం. మా నాన్నకి నీలో అన్నీ నచ్చాయి. ఒక్క డబ్బు లేదన్న విషయం తప్ప. ఆ డబ్బు నాకుందిగా నాన్న అంటే వినరు. ఆయనో పెళ్ళికొడుకును తెచ్చారు. అతన్ని డబ్బు చూసి మాత్రమే చేసుకోవాలి ఎవరైనా. నాన్నకెందుకంత పంతం? ఇదేమన్నా డ్రెస్సా, నగా? పోన్లే యీసారి నాన్నకిష్టమైనది తీసుకొని మరోసారి నా కిష్టమైనది తీసుకుందాం అనుకునేందుకు. ఇక జీవితాంతం ముడిపడి వుండే అనుబంధాన్ని నా కిష్టం లేకుండా ఎలా ఒప్పుకోమంటావు? మా నాన్నకి పంతమేకానీ మన మీదేమీ పగ వుండదు. ఆయననిచ్చిన డబ్బుతోనే పెట్టుబడిగా ఏదైనా వ్యాపారం చేద్దాం. ఇద్దరం మన చదువుల్ని, తెలివిని ఉపయోగించి దాన్ని పదింతలు చేద్దాం. ఆ తర్వాత ఆయన డబ్బు తిరిగి యిచ్చేద్దాం."

"కానీ... సంయూ... ఇదాంతా నాకెందుకో..."

అతన్ని మాట్లాడనివ్వలేదు సంయుక్త. "ఇష్... యింకా మాట్లాడుతూ ఆలోచిస్తూ టైమ్ వేస్ట్ చేయకు. త్వరగా యింటికి ఫోన్‌చేసి డబ్బు తెప్పించు. మన ప్రేమని ఎంత తక్కువగా అంచనా వేస్తారు? డబ్బుతో కొనేస్తారా? ఆ డబ్బుతో ఆ ఆలోచననే మనం కొద్దాం. ఆ తరం వాళ్ళు



వూహించని ముగింపుని మన తరం వాళ్ళం యిద్దాం. నేను వెళుతున్నా యిప్పుడు. రేపటికి పూర్తిగా మనం అయ్యేందుకు వెంటనే నాన్నకి ఫోన్ చేయి డబ్బు తెమ్మని!"